
పట్టణ పేదల ఇంటి కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అప్పట్లోనే చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొన్నిదగ్గర్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టిడ్కో పనులను నిలిపివేసింది. అంతకు ముందు పూర్తి అయిన ఇళ్లను కూడా పంపిణీ చేయలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నా.. తమకు ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆందోళనలు చేసినా వైసీపీ పాలకులు ఎన్నికల ముందు వరకు స్పందించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా పంపిణీ చేపట్టారు. అయితే కొన్నిదగ్గర్ల సక్రమంగా వసతులు కల్పించలేదు. మరికొన్నిదగ్గర్ల పనులు పూర్తిగా జరగలేదు. దీంతో చాలామందికి ఇంటి కాగితాలు చేతికి వచ్చినా ఇళ్లలో చేరలేదు. చేరినవారు అక్కడి సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. అయితే మళ్లీ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తమ ఇంటి కల నెరవేరుతుందని టిడ్కో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



మాచర్ల పట్టణంలోని టిడ్కో గృహాలు

ఇల్లు.. ఇస్తారా?

- కలగానే టిడ్కో గృహయోగం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ
- సౌకర్యాలు లేక ఇళ్లలో లబ్ధిదారుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గత టీడీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 33,264 మంది పట్టణ పేదల కోసం ఆయా మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. వీటిలో గత ప్రభుత్వం 25,228 గృహాల నిర్మాణాల్ని పూర్తి చేసింది. 8,036 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఆధునిక పరిజ్ఞానంతో పేదల కోసం నాటి ప్రభుత్వం ఇళ్లను నిర్మించింది. అద్దె ఇంటి కష్టాలు తప్పుతాయి.. సొంతింట్లో సంతోషంగా ఉండవచ్చని లబ్ధిదారులు ఆశిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పనులను నిలిపివేసింది. మౌళిక వసతుల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడంలో కాలయాపన చేసింది. ఇళ్లు ఇవ్వండి మహాప్రభో అని లబ్ధిదారులు వేడుకున్నా.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ రంగులు వేయడంతో సరిపెట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత ఏడాది చివర్లో వైసీపీ ప్రభుత్వం హడావు డిగా కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్లను అందజేసింది. అయితే అక్కడ మౌలిక వసతులు, సౌకర్యాలు, సరైన రక్షణ చర్యలు లేవు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లోని సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఇళ్లు ఇస్తే తమ అద్దెంటి కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కొన్ని మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికీ అధికారులు మౌనంగానే ఉన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు ఎప్పటికి కల్పిస్తారో.. తమకు ఎప్పటికి ఇళ్లు అందుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు బూజుపట్టగా, టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు పిచ్చిచెట్లతో అడవులను తలపిస్తు న్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో అయితే ఇనుప చువ్వలు తుప్పు పట్టిపోయాయి.

సౌకర్యాలు అంతంతే..

చిలకలూరిపేట: సరైన సౌకర్యాలు లేని కారణంగా చిలకలూరిపేటలోని టిడ్కో గృహాలలో 50 శాతం పైగా కుటుంబాలు నివాసానికి ఆసక్తి చూపడం లేదు. మొదటి దశలో నిర్మించిన 4,612 గృహాల్లో సుమారు 2 వేల మందే నివాసం ఉంటున్నారు. పట్టణానికి నాలుగున్నర కిలోమీటర్ల దూరంలోని చెరువు రోడ్డులోని టిడ్కో సముదాయానికి సరైన రవాణా సౌకర్యం లేదు. పాఠశాల, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్ కూడా అందుబాటులో లేదు. మురుగునీరు పారుదల వ్యవస్థ లేదు. ఇటీవల మంత్రి నారాయణ, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు టిడ్కో సముదాయాన్ని సందర్శించగా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.



చిలకలూరిపేటలో నిర్మించిన టిడ్కో గృహాలు

వివిధ దశల్లో పనులు

సత్తెనపల్లి: పట్టణంలోని పేదలకు ధూళిపాళ్ళ, భీమవరం, గండ్లూరు - 1, 2 ప్రాంతాల్లో 3,235 గృహాలను మంజూరు చేశారు. 1477 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. 1526 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. భీమవరం డొంకరోడ్డులోని టిడ్కో ఇళ్ల పనుల గురించి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతమయ్యాయి. టిడ్కో గృహ సముదాయంలో మురుగు కాల్వలు, రోడ్లు, తాగునీటి తదితర వసతులు కల్పించాలి. విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు మార్చిలో ఇంటి తాళాలు అప్పగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.



సత్తెనపల్లి: పట్టణంలోని టిడ్కో గృహ సముదాయం

ఇనుము ఎత్తేశారు

మాచర్లటౌన్: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల సమీపంలో 2500 టిడ్కో గృహాలను ప్రతిపాదించగా 1050 గృహాలు 60 శాతం పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ గృహాలను 1050కు కుదించింది. అయితే నిర్మాణ పనులను చేపట్టలేదు. నిర్మాణ పనులకు తెచ్చిన ఇరన్‌పై వైసీపీ నేతలు కన్నేశారు. టిడ్కో ఇళ్లకు సంబంధించిన ఐరన్‌ను అమ్మేసుకుని జేబులు నింపుకున్నా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోలేదు. కాగా కొంత మంది లబ్ధిదారులకు రుణాలు కట్టాలంటూ బ్యాంకు నుంచి నోటీసులు వస్తున్నాయి.



మాచర్ల పట్టణంలోని టిడ్కో గృహాలు

పంపిణీ ఎప్పటికో?

నరసరావుపేట: టీడీపీ హయాంలో 2018లో 1504 గృహాలను నరసరావుపేటలో నిర్మించారు. ఇళ్లు నిర్మించి.. వసతులు కల్పించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గృహాల పంపిణీపై అధికారులకే స్పష్టత లేదు. సొంత ఇంటి కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో 285 లబ్ధిదారుల పేర్లను తొలగించడంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో పాత వారికే ఇళ్లు కేటాయించాలని కోర్టు మధ్యంతరం ఉత్తర్వులు ఇచ్చింది. అయినా సదరు పేదలకు ఇళ్లను కేటాయించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. వాటా ధనం చెల్లించిన 580 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం 82 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. మిగిలిన ఇళ్లు ఏళ్లుగా పంపిణీ జరగకపోవడంతో పాడుబడే పరిస్థితులు నెలకొనున్నాయి.



నరసరావుపేటలో పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

ఐదేళ్లుగా ఎక్కడివక్కడే

పిడుగురాళ్ల: పిడుగురాళ్లలోని పేదల కోసం కొండమోడు సీతారామపురం వద్ద 2017లో సుమారు 4 వేల టిడ్కో గృహాలు మంజూరయ్యాయి. 2017లో భూమిపూజ కాగా, 2018 ఆఖరుకి 75 శాతంపైగా గృహాల పనులు పూర్తి అయ్యాయి. 2832 గృహాల పనులు పూర్తి కాగా 2019 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అర్హులకు కేటగిరీల వారీగా కేటాయించారు. బ్యాంక్ రుణం కూడా మంజూరైంది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడ్కో సముదాయాలకు రంగులు వేయడంతో సరిపెట్టింది. లబ్ధిదారులకు గృహాలను కేటాయించకుండా మౌలిక వసతులను కల్పించకుండా వక్కనపెట్టేసింది. మౌలిక వసతుల బిల్లులు జమలో జాప్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మొత్తం ఇళ్లలో ఇంకా సుమారు 1150 వరకు నిర్మించాల్సి ఉంది.



పిడుగురాళ్లలోని టిడ్కో గృహాలు

70 శాతం పూర్తి

వినుకొండ: పట్టణంలో 2018లో అప్పటి మంత్రి నారాయణచే ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన జరిగింది. 4096 గృహాలు మంజూరుకాగా తొలిదశలో 1400 గృహాలు నిర్మించడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. వీటిలో 200 గృహాలు 70 శాతం పూర్తిగా మిగతావి శంకుస్థాపన దశలో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం 2023 తర్వాత 700 గృహాల పనులు చేపట్టింది. ఇవి 70 శాతం పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతమయ్యాయి. డిసెంబరు 31కి సింగిల్ బెడ్‌రూమ్‌లు గల 720 ఇళ్లు పూర్తి చేసి ఇస్తామని అధికారులు తెలిపారు. టిడ్కో గృహాల నుంచి సుమారు 18 అడుగుల వెడల్పుతో 800 మీటర్ల రోడ్డు నిర్మించాలి.



వినుకొండ: పేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్న టిడ్కో గృహాలు



- ఏపీకి కలిసిరానున్న చంద్రబాబు అనుభవం, పవన్ ఆవేశం
- కూటమి ప్రభుత్వ ఏర్పాటు రాష్ట్రానికి సువర్ణావకాశం
- నరసరావుపేటలో విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠ నా కల
- కళాకారులను ప్రోత్సహించేందుకు నంది అవార్డులు ఇవ్వాలి
- చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ -2లకు ప్లాన్
- ఆంధ్రజ్యోతితో సినీనటుడు నరేష్

పదేళ్లలో ప్రథమస్థానం

ఆంధ్రజ్యోతితో అతిథి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అనుభవం.. పవన్‌కల్యాణ్ ఆవేశం కలగలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లలో ప్రథమ స్థానానికి చేరుకుంటుంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరింది. ప్రధాని మోదీ ప్రోత్సాహం, చంద్రబాబు సామర్థ్యంతో అమరావతి పునర్నిర్మాణం జరగడం తథ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్రానికి సువర్ణావకాశం.. అని సినీనటుడు నరేష్ తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. సినీ ప్రస్థానం నుంచి రాజకీయాల వరకు ఆయన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

● సినీ ప్రస్థానం

నా పదో ఏట పండంటి కాపురం సినిమాతో అరంగేట్రం చేశాను. అది మొదలు ఇప్పటివరకు నటిస్తూనే ఉన్నాను. నటప్రస్థానం 50 యేళ్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు హీరోగా రెండు మూడు సినిమాలు చేస్తూ హైసక్సెస్ రేట్‌లో ఉన్నాను. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాలు చేస్తున్నాను. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో యునైటెడ్ నేషన్స్ అంబాసిడర్‌గా ఉన్నాను. గతంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సినీ ఇండస్ట్రీ కోసం, కళాకారులకోసం కృషి చేశాను.

● నరసరావుపేటతో అనుబంధం

నరసరావుపేట మా అమ్మవాళ్ల ఊరు. చిన్నప్పుడు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేవాణ్ని. ఇక్కడ మా బంధువులు చాలామంది ఉన్నారు. కొంతకాలంగా ఈ ఊరితో అనుబంధం తెగిపోయింది. అనుకోకుండా ఈ కార్యక్రమంతో మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. అమ్మ భారతదేశం గర్వించదగ్గ నటిమణి. 46 సినిమాలకు దర్శకత్వం వహించింది. గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మహిళా దర్శకురాలు. అమ్మకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు రాకపోవడం వెలితిగా అన్పిస్తుంది. తను పెరిగిన నరసరావుపేటలో విగ్రహం పెట్టాలి అనగానే స్థానిక ఎమ్మెల్యే సహకరిస్తానని సభాముఖంగా చెప్పడం సంతోషం. కాపు సంఘం ద్వారా త్వరలో మంచి ప్రదేశం చూసి అమ్మ విగ్రహం ఏర్పాటు చేయించడం జరుగుతుంది. ఇక్కడ అమ్మ విగ్రహం ప్రతిష్ఠించడం నా కల. సహకారం ఇస్తానన్నందుకు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు.

● రాష్ట్రం ఇక సుభిక్షం

ప్రజలందరూ కోరుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరుగుతుంది. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుభిక్షంగా మారుతుంది. కేంద్రంలో ప్రధాని మోదీ సహాయ సహకారాలు, చంద్రబాబు సమర్థతతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది.

● షూటింగులకి రాయితీలు ఇవ్వాలి

రాష్ట్రంలో సినిమా షూటింగులకు ఎన్నో అనువైన లొకేషన్లు ఉన్నాయి. ఇక్కడ షూటింగులు జరుపుకోవడానికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాబట్టి సినిమా పరిశ్రమకు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభావం ఉంది. కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేలా నంది అవార్డులు ఇవ్వాలి. నంది అవార్డులు ఇవ్వడం అనేది దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. దీనిని మళ్లీ పునరుద్ధరించాలి. ఓటీటీలు రావడంతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇది బాధ కలిగించే విషయమైనా, టెక్నాలజీతో వచ్చే మార్పులతో నడవాలి. చిత్రం భళారే విచిత్రం పార్ట్ 2 స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ 2 తీయడానికి ప్లాన్ చేస్తున్నాను.

క్రీడా ప్రాంగణం.. ప్రైవేటీకరణ

- నిర్వహణ నుంచి తప్పుకుంటోన్న శాప్
- ఇండోర్ స్టేడియం, జిమ్ లీజుకు టెండర్లు
- ఇక నడకకూ నగదు వసూలు చేస్తారేమో?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పతకాలు సాధిస్తే నజరానాలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల అభివృద్ధిని విస్మరించింది. గత వైసీపీ ప్రభుత్వం క్రీడా ప్రాంగ ణాలను ప్రైవేటీకరించగా అదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా పయనిస్తోందా అంటే చోటుచేసుకుంటున్న పరిణామా లు అవునంటున్నాయి. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగ ణాన్ని ప్రైవేటీకరించే దిశగా శాప్ చర్యలు చేపట్టింది. ఇండోర్ స్టేడియం, జిమ్‌లను లీజుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచింది. ఈ నెల 25 నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. 29లోగా బిడ్లు దాఖలు చేయాలని డీఎస్‌ఏ ప్రకటించింది. ఇలా స్టేడియంలోని ఒక్కో విభాగాన్ని లీజుకు ఇచ్చేస్తూ నిర్వహణ నుంచి శాప్ తప్పుకుంటోన్నది. చివరకు ఇక్కడి వాకింగ్ ట్రాక్‌లో కూడా నగదు వసూలు చేసినా ఆశ్చర్యం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. పేద క్రీడాకారులను క్రీడలకు దూరం చేసే శాప్ తీరును క్రీడాకారులు, క్రీడాభిమానులు వ్యతిరేకిస్తున్నారు.

రాష్ట్రంలోనే అతి పెద్ద క్రీడా ప్రాంగణం..

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు క్రీడా ప్రాంగణం రాష్ట్రంలోనే అతి పెద్దది. దాదాపు 20 ఎక రాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకుంది. ఇండోర్ కోర్టులు, జిమ్‌లను జాతీయ ప్రమాణాలతో నిర్మించారు. ఈతకొలను, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ కోర్టులతో పాటు రన్నింగ్ ట్రాక్ ఉంది. 1997లో నరసరావుపేట ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ స్టేడియాన్ని నిర్మించారు. నవ్యాంధ్ర తొలి స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఈ స్టేడియాన్ని మానస పుత్రికలా భావించి అభివృద్ధి చేశారు. ఎందరో దాతలు విరాళాలు అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు వేదికగా నిలిచింది. ఖేలో ఇండియా వంటి ప్రతిష్ఠాత్మకమైన పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో స్టేడియానికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇక్కడ క్రికెట్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిం చారు. జిల్లా ఏర్పాటుతో క్రీడా ప్రాంగణాన్ని శాప్ తన ఆధీనంలోకి తీసుకున్నది. శాప్‌కు ముందు స్టేడియం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉండగా దాతల సహకారంతో వసతుల కల్పనతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహాలు అందేవి. శాప్ వీటికి స్వస్తి చెప్పడంతోపాటు నిర్వహణను కూడా గాలికొదిలేసింది.



లీజుకు ఇచ్చేందుకు టెండర్ నిర్వహిస్తున్న జిమ్ భవనం



అధ్వానంగా ఉన్న క్రీడా ప్రాంగణం

క్వింటాల్‌కు రూ.20 వసూలు

- పత్తి రైతులను పీడిస్తోన్న సిబ్బంది
- ఇవ్వకపోతే వేలిముద్రలు వేయని వైనం
- సీసీఐ కేంద్రాల్లో వసూళ్లపై రైతుల ఆగ్రహం



సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తి నిల్వలు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు.. తేమ శాతం.. రవాణా.. నిరీక్షణలతోనే ఇబ్బంది పడుతున్న పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో సిబ్బంది తీరుతో దోపిడీకి గురవుతున్నారు. పత్తి పండించి దానిని విక్రయంచడానికి రైతులు నరకం చూస్తున్నారు. ఏదో ఒక రూపంలో పత్తి రైతులకు వేధింపులు ఎదురౌతూనే ఉన్నాయి. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే పత్తికి క్వింటాల్‌కు రూ.20 ముడుపులు రూపేణా చెల్లించాల్సిందేనని కొందరు సిబ్బంది తెగేసి చెబుతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే పత్తిని దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొనుగోలు వ్యవహారంలో ఉన్నత స్థాయి వ్యక్తులు రంగ ప్రవేశం చేసినా సీసీఐ కేంద్రాల్లో ఎదురౌతున్న అనుభవం చూసి రైతులు ఖంగు తింటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఎక్కువ బాగం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా సీసీఐ కేంద్రాలు కూడా గుంటూరులోనే ఏర్పాటు చేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వారీగా విభజించిన మీదట సుమారు 32 కేంద్రాల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నాయి. రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న పత్తిని అమ్మకం కోసం ఆయా కేంద్రాలకు తీసుకురావాల్సి వస్తుంది. రైతులు ఎంత మొత్తంలో అయితే కేంద్రానికి పత్తి తీసుకువస్తారో ఆ వివరాలు సీఎం యాప్‌లో కూడా నమోదు చేయాలి. అందుకోసం ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిబ్బంది, బయ్యర్లు వేలిముద్రలు వేయాలి. ఒక వేళ వేలిముద్రలు వేయకపోతే సదరు వివరాలు సీఎం యాప్‌లో అప్‌లోడ్ అవ్వవు. వివరాలు అప్‌లోడ్ కాకపోతే పత్తి కొనుగోళ్లు జరగవు. ఈ పరిస్థితుల్లో కేంద్రాల్లో సిబ్బందికి ముందే రైతులు కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇవ్వకపోతే వేలి ముద్రలు వేయమని సిబ్బంది ముందే చెబుతున్నట్లు వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సిబ్బందికి సీసీఐ బయ్యర్లు కూడా అనధికారికంగా 2 నుంచి 3 శాతం వరకు చెల్లించే పద్ధతి అమల్లో ఉన్నట్లు సమాచారం. అది చాలక రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు రైతులకు ఏమో గానీ కొందరికి మాత్రం మంచి లాభదాయకంగా ఉంది.

7

మెగా జాబ్‌మేళాలో మెరుగైన ఉద్యోగాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు



అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

- జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు
- ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు
- ఐదుశాతం జీఎస్టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య

నరసరావుపేటలో డాక్టర్ ఇంట విషాదం

నేడు, రేపు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు

రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్థోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)

అస్ట్రో గైడ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400
నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400
(24,000 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400
(23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ!

న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్, ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్ ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్ల నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప' కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.





మహిళా సంఘాల నిధుల గోల్‌మాల్‌పై విచారణ



డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌కు సమస్యను వివరిస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట, వైకుంఠపురం, చావపాడు గ్రామాల్లో గ్రామ సమైఖ్య సంఘాల సభ్యుల రుణాల చెల్లింపులో జరిగిన సుమారు రూ. 1.5 కోట్ల గోల్‌మాల్‌కు సంబంధించి పత్రికలలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన ఆదివారం మండల సమాఖ్య కార్యాలయంలో విచారణ చేపట్టారు. రుణాలు చెల్లించినప్పటికీ అప్పులు ఉన్నట్లు చూపిస్తున్నాయని బాధిత మహిళలు వీవోలు చేసిన మోసాన్ని బాలునాయక్ దృష్టికి తీసుకువచ్చారు. శ్రీనిధితోపాటు తాము తీసుకున్న పలు రుణాలు తిరిగి చెల్లించినప్పటికీ బ్యాంకులలో తమ పేరున అప్పులు అలానే ఉన్నాయని మండల సమాఖ్యకు బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల్లో మూడు కమిటీలను ఏర్పాటు చేసి సంఘాల వద్ద విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, నగదు రికవరీ చేసి న్యాయం చేస్తామని బాలునాయక్ హామీ ఇచ్చారు. కొందరు మహిళలు తమ యానిమేటర్‌ను తొలగించాలని కోరడంతో గ్రామ సమాఖ్య సంఘాలు తీర్మానం చేసుకుని తొలగించుకోవచ్చుని తెలిపారు. విచారణలో శ్రీనిధి ఏజీఎం ఆర్.చినబుల్లయ్య, హనుమాన్ నాయక్, ఏపీఎం కృష్ణప్రియ, మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మి, శివకుమారి, భాగ్యలక్ష్మి, బూక్యా బాలమ్మ, మరియమ్మ, సీసీలు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

● కర్నూలు జట్టుపై ఉమ్మడి గుంటూరు జట్టు విజయం



విజయం సాధించిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14 విభాగపు బాలబాలికల ఖోఖో పోటీలు ఆదివారం పోటాపోటీగా సాగాయి. బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు, కర్నూలు జట్టుపై 10-7 తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు జట్టు, ఈస్ట్ గోదావరి జట్టుపై 10-6, విశాఖ జట్టు విజయనగరం జట్టుపై 9-8, ప్రకాశం జట్టు కడప జట్టుపై 11-6 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు ప్రకాశం జట్టుపై 10-6, విజయనగరం జట్టు కడప జట్టుపై 9-3, విశాఖపట్నం జట్టు అనంతపురం జట్టుపై 9-8 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలుర సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - గుంటూరు, విశాఖ - ప్రకాశం, బాలికల సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - విజయనగరం, శ్రీకాకుళం - విశాఖపట్నం జట్లు పోటీ పడనున్నాయి.

నేడు, రేపు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

సత్తెనపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం వద్ద గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్ ఆదివారం తెలిపారు. ప్రదర్శనకు చైర్మన్‌గా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపిక చేసిన 70 ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారని ప్రిన్సిపల్ తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్టు జాన్సన్ తెలిపారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సోమవారం గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం నుంచి గుంటూరు రావాల్సిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు అవుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

● జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు
● ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు
● ఐదుశాతం జీఎస్‌టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు కలిసి చేసే జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు జరుగుతాయి. యార్డు చుట్టుపక్కల ఉన్న కారం మిల్లులతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్నవాటికి జీరో బిజినెస్‌లోనే ఎండు మిరపకాయలను సరఫరా చేస్తుంటారు. ఇందుకు కారణం మిర్చిని సరఫరా చేసిన వెంటనే నగదు చేతికందుతుంది. కొనుగోలు చేసిన వ్యాపారి 5 శాతం జీఎస్‌టీని వాణిజ్య పన్నుల శాఖకు పంగనామం పెడతారు. మిర్చి పండని తూర్పు, పశ్చిమ గోదావరి లాంటి జిల్లాలకు కూడా జీరో బిజినెస్‌లోనే మిర్చి ఎగుమతి జరుగుతుంటుంది. ఉత్తరాదిన ఉన్న కొన్ని రాష్ట్రాలకు కూడా ఇదే విధానంలో మిర్చిని వ్యాపారస్తులు పంపిస్తారు. దీనివలన ఏటా రూ.కోట్లలోనే మార్కెట్ ఫీజు రూపంలో మిర్చియార్డుకు, జీఎస్‌టీ రూపంలో వాణిజ్య పన్నుల శాఖకు నష్టం వాటిల్లుతుంది. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా విచారణ జరిపి నిర్ధారించింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మిర్చియార్డులో జీరో బిజినెస్‌ని పూర్తిగా నిలిపేయాలని పర్సన్ ఇన్‌ఛార్జ్ అమిలినేని భార్గవ తేజ ఆదేశాలు జారీ చేశారు. అవి ఏమేరకు అమలు జరుగుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.

వ్యాపారస్తులు కూడబలుక్కుని..

రైతులు తీసుకొచ్చే మిర్చిని యార్డులో కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కొనుగోలు చేసినందుకు ఒక శాతం మార్కెట్ ఫీజుని ఎగుమతిదారులు మార్కెట్ కమిటీకి చెల్లిస్తారు. కమీషన్ వ్యాపారస్తులు రైతు వద్ద 2 శాతం వసూలు చేసుకుంటారు. ఎగుమతిదారులు చెల్లించే 1 శాతం మార్కెట్ ఫీజుపైనే మార్కెట్ కమిటీ నిర్వహణ ఆధారపడి ఉంటుంది. అయితే దిగుమతి, ఎగుమతి వ్యాపారస్తులు కూడబలుక్కుని దీనిని మార్కెట్ కమిటీకి రాకుండా చేస్తున్నారు. నిత్యం కొన్ని వందల మిర్చి టిక్కీలు ఇలా జీరోలో బయటకు వెళ్లిపోతున్నాయి. ఈ విషయం యార్డు సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే వ్యవహారం కాదు. ఇందులో సూపర్‌వైజర్ల పాత్ర కూడా ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

ట్రేడింగ్ జరగలేదని చెప్పి..

యార్డు పరిసర ప్రాంతాల్లో పలు కారం తయారీ మిల్లులున్నాయి. వీటిల్లో ఉత్పత్తి అయిన కారం స్థానిక అవసరాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో కారం మిల్లుల యజమానులు ఎగుమతిదారుల ద్వారా మిర్చిని కొనుగోలు చేస్తారు. ఇక్కడే జీరో వ్యాపారానికి తెర తీస్తారు. మిర్చియార్డులో ట్రేడింగ్ జరగలేదని చెప్పి కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేయడానికి తీసుకెళ్తున్నామని చెప్పి యార్డు గేటు దాటిస్తారు. అయితే అప్పటికే ఆ మిర్చిని ఎగుమతిదారుడు కొనుగోలు చేసి ఉంటాడు. ఇలా గేటు దాటిన మిర్చిని నేరుగా కారం మిల్లులకు చేర్చి అక్కడ కారం తయారీకి వినియోగిస్తారు. దీనివలన మిర్చియార్డుకు ఎలాంటి ఆదాయం రాకుండా పోతుంది. అలానే గుంటూరు మార్కెట్ కమిటీ పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలన్నా యార్డుకు ఫీజు చెల్లించాలి. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలపై సరైన అజమాయిషీ, లెక్కలు లేని కారణంగా ఇక్కడ సులభతరంగా జీరో బిజినెస్ జరుగుతుంది.

కటింగ్ బిజినెస్‌ని గుర్తించాలంటే..

రేట్ కటింగ్ బిజినెస్ మిర్చియార్డులో విచ్చలవిడిగా జరుగుతుంటుంది. ఎగుమతిదారుడు క్వింటాల్ రూ. 16 వేలకు కొనుగోలు చేసి లెక్కల్లో మాత్రం క్వాలిటీ బాగాలేదనో, వేరే రకం మిరపకాయలనో నమోదు చేసి ధరని రూ. 12 వేలకు తగ్గిస్తారు. దీనివలన కూడా మార్కెట్ ఫీజు, జీఎస్‌టీ రూపంలో కోత పడుతున్నది. ఈ అక్రమ వ్యాపారాన్ని గుర్తించాలంటే చాలా కష్టం. ఈ అక్రమ వ్యాపారాలను అరికట్టాలన్న జేసీ భార్గవతేజ ఆదేశాలు ఏమేరకు అమలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

మెగా జాబ్ మేళాలో మెరుగైన ఉద్యోగాలు

● రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు
● 60 కంపెనీలు.. 3,604 మందికి ఉద్యోగాలు
● మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపిన యువత



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు, నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు వరంలా మారింది. జాబ్‌మేళాకు రాష్ట్ర నలుమూలల నుంచి 11,500 మందికిపైగా హాజరు కాగా ప్రతిభ, అవగాహనా సామర్థ్యం ఆధారంగా 3,604 మందికి ఉద్యోగాలు లభించాయి. ఐటీ, డేటా ఎంట్రీ, బీపీవో, రిటైల్, ఈకామర్స్, టూరిజం, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమోటివ్, వైద్యం, ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, పేటీఎం, ఎయిర్‌టెల్, రిలయన్స్, హీరో మోటార్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్ తదితర రంగాల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాబ్ మేళా జరిగింది. మంగళగిరి నియోజకవర్గ యువత కోసమే జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రకటించినప్పటికీ రాష్ట్ర నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏడు నుంచి పదో తరగతి చదివిన వారు, ఇంటర్, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. 60కి పైగా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల ఆధారంగా రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు జీతం కలిగిన ఉద్యోగాలకు 3,604 మందిని ఎంపిక చేయగా, కూటమి నేతల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన అనంతరం కూటమి నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మంగళగిరిలో మెగా జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో అనేక ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సూర్యలంక తీరం.. జనసంద్రం

● పోటెత్తిన లక్షమందికిపైగా పర్యటకులు



బాపట్ల సూర్యలంక తీరంలో భారీగా పర్యాటకులు

బాపట్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) బాపట్ల మండలం సూర్యలంక తీరంకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో రావటం కార్తీక పౌర్ణమి రోజును తలపించింది. సుమారు లక్షమందికి పైగా పర్యాటకులు తీరంకు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేశారు. సెలవు రోజు కావడం పైగా కార్తీకమాసం చివరి ఆదివారం కావటంతో దూరప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు తీరానికి పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి వాహనాల ద్వారా తెల్లవారుజామునే తీరానికి చేరుకుని పుణ్యస్నానాలను ఆచరించారు. తీరంలో యువకులు కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుక తిమ్మెలతో ఆడుకుంటూ ఆనందంగా గడిపారు. మహిళలు, మాలాధరణ భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాలను ప్రతిష్ఠించి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సామాజిక వర్గాల వారు తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కార్తీక వనభోజనాలను నిర్వహించుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కుటుంబ సమేతంగా వనభోజనాలను చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం, శ్రీతారకేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. సూర్యలంక తీరంకు వాహనాలు అధిక సంఖ్యలో రావటంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు తన సిబ్బందితో పర్యవేక్షించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య



మృతుడు డాక్టర్ వరగాని జవహర్

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుని ఎంత సేపటికీ రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జవహర్ తండ్రి డాక్టర్ విజయ్‌సాగర్ నర్సరావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రేపటి వాక్ ఇన్ అడ్మిషన్స్ రద్దు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సుకు ఈ నెల 26న జరగాల్సిన వాక్ ఇన్ అడ్మిషన్స్ ప్రక్రియను రద్దు చేసినట్లు రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజున వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు హాజరు కావాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

గత ప్రభుత్వంలో మైనార్టీలపై వివక్ష

● ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్



సమావేశంలో మాట్లాడుతున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్

పిడుగురాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు ఎంతో వివక్షతకు గురయ్యారని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఆదివారం పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీలకు రావాల్సిన పథకాలు గత ఐదేళ్లుగా ఎన్నో నిలిపివేశారని, 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింలకు ఒక స్వర్ణయుగంలా ఉందన్నారు. ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథకం కింద రూ. 50 వేలు, దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు, షాదీఖానా, ఈద్గాలు, మదర్సా నిర్మాణాలు ఎన్నో జరిగాయన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఎంతో ద్రోహం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, అబ్దుల్లా, ముజీబ్, కార్ సైదా, టీడీపీ మస్తాన్‌వలి, ఫరీద్ మేస్త్రి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు. గుంటూరు నుంచి దాచేపల్లి వస్తుండగా మార్గమధ్యంలోని సత్తెనపల్లిలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్‌ను సత్తెనపల్లి టీడీపీ ముస్లిం నేతలు ఘనంగా సన్మానించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 585.90 అడుగులు ఉంది. ఇది 300.03 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,651 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,651 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్రరెడ్డి

● గుంటూరు శాఖకు మూడు పతకాలు



పతకాలతో డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అవార్డు అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి గుంటూరు శాఖను అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచేలా తీర్చిదిద్దినందుకుగానూ డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డు దక్కింది. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నూతన అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ చేతులు మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శితోపాటు గుంటూరు శాఖకు ఉత్తమ సేవా విభాగం, విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం (ఫ్లడ్ రిలీఫ్) అందించినందుకుగానూ మరో రెండు పతకాలు లభించాయి. ఈ సందర్భంగా ఐఎంఏ నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా డాక్టర్స్ దివాళీ సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్‌జీ కర్ కాలేజి ఘటన నిరసన కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహించారని తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో కొమ్మాలపాటి

పెదకూరపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. అమెరికాలో స్థిరపడిన రాయపూడి రామకృష్ణ విద్యార్థులకు లక్షా 15 వేల రూపాయల స్కాలర్‌షిప్ ప్రకటించి, కొమ్మాలపాటి శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అసమాన ప్రతిభతో రాణించి, అమెరికాలో స్థిరపడిన యువకులు అనేకమంది గత ఎన్నికల్లో టీడీపీ కోసం ఇండియా వచ్చి పని చేశారని, ఆ తరువాత కూడా ఈ రూపంలో సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వెన్నా సాంబశివారెడ్డి, వరప్రసాద్, రాయపూడి శంకర్రావు, నరసింహారావు, రవి, సోమయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం జంపని శివాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వేమూరు ఎస్ఐ రవికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన చల్లంచర్ల సుబ్రహ్మణ్యం తెనాలి వెళ్తుండగా, జంపని శివాలయం సమీపంలో తెనాలి నుంచి కొల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుబ్రహ్మణ్యం సోదరుడు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 39.74 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 300 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందని తెలపారు.

జోన్ డైరీ

● మండల కేంద్రమైన కారంపూడిలో ఈనెల 30 నుంచి జరగనున్న వీరుల ఉత్స వాలు కార్యక్రమాల నిర్వహణపై మధ్యాహ్నం 2 గంటలకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దారు పుల్లారెడ్డి తెలిపారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించను న్నట్లు ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ రెండు సమావేశాల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి పాల్గొననున్నారు.

ఇత్తడి వస్తువుల అందజేత

రెంటచింతల,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :కృష్ణానది ఒడ్డున గత సత్రశాలలోని గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వార్ల ఆలయానికి ఇత్తడి ప్లేట్లు, హారతులను హైదరాబాద్‌కు చెందిన చక్రవరం నాగ హృతికేష్ అందజేసినట్లు దేవాదాయ ఈవో గాదే రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాత నాగ హృతికేష్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



పైపు నుంచి లీకవుతున్న నీరు

మంచినీటి పైప్ లైన్ లీకు

రెంటచింతల,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మేజర్ పంచాయతీ రెంటచింతల ప్రజలకందిస్తున్న మంచినీటి పైప్ లీకవుతుంది.దీంతో ఆ ప్రాంమంతా మడుగులా తయారైంది.ఎర్రకాలువ సమీపంలోని బోర్ నుంచి వచ్చే నీటిని మార్కెట్ యార్డులోని ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీటిని పంపిస్తారు.ఇక్కడ నుంచి రెంటచింతలలోని వివిధ వార్డులకు ట్యాప్‌ల ద్వారా మంచి నీటిని అందిస్తున్నారు.తరుచు లీక్ కావడం వలన ట్యాప్‌లకు పూర్తి స్థాయిలో నీరు రావడం లేదు.పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

బీసీ కుల గణన చేపట్టాలి

అచ్చంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీసీ కుల గణనను తక్షణమే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగుండ్ల శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం అచ్చంపేటలో బీసీ నియోజక వర్గ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి పడకండ్ల లక్ష్మణాచారి అధ్యక్షతన సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ బీసీ కులాలు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యా, ఉద్యోగ పరంగా అభ్యున్నతి సాధించాలంటే బీసీ కుల గణన ముఖ్యమని తెలిపారు. బీసీ కుల గణన చేపట్టాలనే విషయమై సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో క్రోసూరు మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోనంకి గురునాథం, బీసీ నాయకులు ముసుగు సాంబశివరావు, బత్తుల కోటేశ్వరరావు, రంగు సత్యనారాయణ, పరిమి గురునాథం, వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

నకరికల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కండ్లకుంటలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలందరి సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

సహపంక్తి భోజనాలతో
ప్రజల్లో ఐక్యతకు చిహ్నం

ముప్పాళ్ళ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో వన సమారాధనలో భాగంగా మండలంలోని గ్రామాల్లో సహపంక్తి భోజనాలు నిర్వహించడం ప్రజల్లో ఐక్యతను చిహ్నమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తనయుడు, మాజీ గుంటూరు మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని చాగంటి వారిపాలెం జగన్నాధ స్వామి ఆలయంలో జరిగిన కాపు వన సమారాధనలో నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని వారితో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శిరిగిరి వెంకటరావు, అన్నదాసు వెంకట స్వామి, నాము శివ, దేవిశెట్టి కోటేశ్వరరావు, బండారు పూర్ణ మహేష్ పాల్గొన్నారు.

నిబంధనల బంధనం

- పత్తికి ప్రభుత్వ మద్దతు ధర ఎండమావే..
- తేమ శాతం పేరుతో కొనుగోలు చేయనివైనం
- ఇదే అదనుగా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, దళారులు
- నిబంధనలు సవరించాలని రైతుల విన్నపం

పత్తి ధర మరింత పతనమైంది. ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనల పేరుతో పత్తి కొనుగోళ్లకు మొకాలడ్డుతోంది. దీంతో వ్యాపారులు, దళారులు గ్రామాల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన కనీస మద్దతు ధర కంటే రూ.600 తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు వచ్చినకాడికి అమ్ముకుంటున్నారు.

సత్తెనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణంలో లక్ష్మీ కాటన్ ట్రేడర్స్ నందు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బుధ వారం నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు రెతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకోవటానికి రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, సీసీఐ సమన్వయ లోపం పత్తి రైతులకు శాపంగా మారింది. కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువగా గ్రామాల్లో దళారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ మద్దతు ధర క్వింటా రూ 7,521 ప్రకటించింది. దీంతో లాభాలు రాకపోయినా కనీసం పెట్టుబడి ఖర్చులైనా వస్తాయని రైతులు భావించారు. తీరా పత్తిని తీసుకొని కొనుగోలు కేంద్రానికి వస్తే సీసీఐ అధికారులు నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రం నుంచి పత్తిని వెనక్కి తీసుకు వెళ్తున్నారు. సీసీఐ నిబంధనల వలన మద్దతు ధరకు పత్తిని అమ్ముకోలేక పోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణంలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి తేమశాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పత్తి రైతు ఈ పంట నమోదు చేసుకొని ఉండాలని, రైతు సేవా కేంద్రాల్లో ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని, సీసీఐ చెప్పిన రోజే కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని, పత్తి బోరాల్లో కాకుండా లూజుగా వాహనాల్లో తేమలేకుండా తీసుకు రావాలని, తేమ ఎనిమిది శాతం నుంచి 12 శాతానికి మించకూడని, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా నెంబరు ఉండాలని.. ఇలా పలు నిబంధనలు ఉన్నాయి. వీటితో పాటు ఎకరాకు మొదటి కోత దిగుబడిలో 40 శాతం పంటను మాత్రమే మొదట విక్రయం, అలా మూడు సార్లు మాత్రమే విక్రయించాలన్న నిబంధన ఉంది. వీటన్నింటిని అధిగమించి పత్తిని అమ్మితేనే రైతుకి మద్దతు ధర లభిస్తుంది. పత్తి కొనుగోలు చేశాక పది రోజుల తర్వాత సీసీఐ రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తుంది. సోమవారం నుంచి శుక్రవారం వరకు వారానికి ఐదురోజులే కొనుగోలు పనిచేస్తాయి. సీసీఐ అధికారులు తేమ అధికంగా ఉందన్న పేరుతో అనేక మంది రైతుల పంటను కొనుగోలు చేయటం లేదు. దీంతో వారు నిరాశతో పంటను తీసుకొని వెనుదిరుగుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, దళారులు పంటను తక్కువ ధరకు కొనుగోలుచేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే కొనసాగితే తాము అప్పులపాలవటం ఖాయమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు సడలించాలి..



మార్కెట్‌లో రోజురోజుకు పత్తి ధరలు పతన మవుతున్నాయి. మద్దతు ధరకు సీసీఐ కొనుగోలు చేస్తున్నా, నిబంధనలు పంట అమ్మకానికి అడ్డంకిగా మారాయి. సీసీఐ నిబంధనలు సడలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే పత్తిని కొనుగోలు చేస్తేనే రైతులకు కొంత ప్రయోజనం ఉంటుంది.

- మన్నవ సాంబయ్య, ఫణిదం రైతు

మహనీయుల త్యాగాలు మరువలేనివి

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని

గురజాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహనీయుల త్యాగాలు మరువలేనివని గురజాల నియోజక వర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ ఎన్నో పోరాటాలు చేయగా, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలను అర్పించారని అన్నారు. మహనీయులు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. అనంతరం శ్రీవాసవీ ఆర్యవైశ్య వయోవృద్ధ సేవ ఆశ్రమ ట్రస్ట్‌ను ఆయన ప్రారంభించారు.

వనభోజనాలతో ఐక్యత ..

కార్తీక మాస వన భోజనాలతో ప్రజల్లో ఐక్యత పెంపొందుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా రాణించాలని ఆకాంక్షించారు. వారి అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలన్నారు. అనంతరం విశ్వబ్రాహ్మణ గురజాల మండల కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని



టీడీపీలో చేరిన గోపిరెడ్డితో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

టీడీపీలోకి వైసీపీ నేత,
మాజీ జడ్పీటీసీ గోపిరెడ్డి

మాచర్లరూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ, వైసీపీ సీనియర్ నేత శ్రీరెడ్డి గోపిరెడ్డి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం మండలంలోని తాళ్లపల్లిలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి సమక్షంలో 50 మంది వైసీపీ కార్యకర్తలతో కలిసి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి వారికి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరినవారిలో గోపిరెడ్డితో పాటు కాశిరెడ్డి, మోహన్‌రావు, శౌరెడ్డి, అంజయ్య, నందిగం ప్రభాకర్, దేవదాసు, గోపి, పరుశురాం, పున్నయ్య తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

మండలంలోని తాళ్లపల్లిలో క్రీస్తు లూథరన్ చర్చి 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే జూలకంటి బహుమతులు అందించారు. రాజేష్‌టీం విజేతగా నిలువగా రూ. 30 వేల నగదు, షీల్డ్‌ను అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి సైదారావు, గుండాల శ్రీను, కొండా హుస్సేన్, బ్రహ్మయ్య, వీర్ల నాగరాజు, గోపిరాజు, సాంబశివరావు పాల్గొన్నారు.

11 మంది జూదరులు అరెస్టు

రెంటచింతల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాలలో జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధీర్ (దుర్గి) తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ. 72 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో జూదం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, అట్టి వారి వివరాలను తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చినవారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్‌ఐ సుధీర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గురజాలటౌన్, నవంబరు24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం తహసీల్దారు నగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలో భాగంగా జరుగుతున్న ఓటర్ల స్పెషల్ క్యాంపుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బందిత ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సంబంధిత బీఎల్వో సమక్షంలో స్పెషల్ క్యాంపులు నిర్వహించామన్నారు. ఓటరు నమోదు, తొలగింపులు, ఓటు కార్డు సవరణలకు 43 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు తెలిపారు.

'స్పందన' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

మండలంలోని రైతులు, ప్రజలు సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు నగేష్ కోరారు. స్పందన కార్యక్రమంలో ప్రజలు వారి సమస్యలపై దరఖాస్తులు అందజేస్తే, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు.

పంటల బీమా పథకంలోకి 'వరి'

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో పంటల బీమా పథకం కింద వరి పంటను ఎంపిక చేసినట్టు మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పంటల బీమాపథకం అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం గడువును డిసెంబరు 31 వరకు పొడిగించినట్టు తెలిపారు. ఎకరానికి రూ.630 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కో-ఆర్డినేటర్ గోపీ పాల్గొన్నారు.

పంట బీమా అమలు చేయాలి

రాజుపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంటకు పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని తెలుగు రైతు జిల్లాకార్యదర్శి నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు) కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలతో పత్తి దిగుబడి తగ్గిపోయిందని, దీంతో పత్తి రైతులు పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. రాజుపాలెంలో పత్తి కొనుగోలుకేంద్రం ఏర్పాటు విషయాన్ని ఎమ్మెల్యే కన్నా దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

140 మందికి కంటి పరీక్షలు

మాచవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కాకాని శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో, మాచవరంలోని వడియరాజుల కళ్యాణ మండపంలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఆకాంక్ష సుమారు 140 మందికి కంటి పరీక్షలు నిర్వ హించగా వీరిలో 48 మంది శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారిని శంకర్ కంటి ఆస్పత్రికి శస్త్రచికిత్స నిమిత్తం బుధవారం తరలిస్తున్నట్లు నిర్వాహకులు, మాజీ సర్పంచ్, టీడీపీ నేత బండ్ల నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో చెన్నాయపాలెం టీడీపీ కార్యకర్తలు సాగర్, గెల్లిపోగు రమేష్, సురేష్, నాయక్, శంకర్ కంటి ఆస్పత్రి సిబ్బంది తదితరులు సహాయ సహకారాలు అందించారు.

దొడ్లేరులో వైద్యశిబిరం

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్లేరు విజ్ఞాన్ పబ్లిక్‌స్కూల్లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎముకలు, కీళ్ళ వ్యాధు లతో బాధపడేవారికి సుమారు రూ.2 వేల విలువ చేసే ఎముకల సాంద్రత పరీక్షను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గైనకాలజీ వైద్యులు పలువురి మహిళలకు స్కానింగ్ పరీక్షను చేశారు. అలాగే ఐయూఐ, ఐవీఎఫ్, సరోగసి పద్ధతుల ద్వారా సంతానం కలిగే విధానాన్ని వివరించారు. శిబిరానికి దొడ్లేరు, అనంతవరం, ఆవులవారిపాలెం, హసానాబాద్ గ్రామాలకు చెందిన రోగులు హాజరయ్యారు. శిబిరంలో డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ వసంతరాయ, ఆర్‌ఎంపీ వైద్యుల బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు విధిగా
పాఠశాలకు హాజరు కావాలి

నకరికల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి క్రమంతప్పక పాఠశా లకు హాజరు కావాలని ప్రధానోపాధ్యాయుడు తుర్లపాటి నగేష్ కోరారు. కొన్ని రోజులుగా పాఠశాలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థుల వివరాలను తీసుకొని ఆదివారం ఆ విద్యార్థుల ఇంటికి వెళ్ళి పాఠశాలకు హాజరు కాకపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఇలా తరగతుల వారీగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థులను పాఠశాలకు రప్పించేలా వినూత్న కార్యక్రమం చేపట్టిన హెచ్‌ఎం నగేష్, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో మ్యాథ్స్ అసిస్టెంట్‌లు పీ.కిరణ్మయి, ఎంఏ స్వర్ణ కుమారి, కే.వీరమ్మ పాల్గొన్నారు.

భగవద్గీత ప్రాధాన్యంపై అవగాహన

రెంటచింతల,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కూడళ్లల్లో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక నిర్వాహకులు భగవద్గీత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత హిందువులకు తలమానికం వంటిదని, దీపారాధాన జ్ఞాన సాధనానికి గుర్తని, కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం ఆత్మను ఆరాధించడం కోసమేనని వివరించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల,చిలకలూరిపేట కమిటీల అధ్యక్షుడు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కార్తీక్, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, గంగయ్య, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

సమస్య ఇది.. స్పందించరూ

క్రోసూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం క్రోసూరులోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జల జీవన్ మిషన్ పైపులైన్‌ల నిర్మాణం కోసం సిమెంట్ రోడ్లను మధ్యలో తవ్వారు. ఇంతవరకు పనులు పూర్తి చేయలేదు. రోడ్డు మధ్యలో కాలువలు తవ్వటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో చేపట్టిన ఆ పనులకు బిల్లులు రావన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు ఆ పనులు పూర్తి చేయటం లేదు. దీంతో రోడ్డు మధ్యలో గోతుల వలన పాదచారులతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల పలువురు కాలువలో తీవ్రంగా గాయపడిన సందర్భాలు ఉన్నాయి. రోడ్డు మధ్యలో తవ్విన కాలువలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



సిమెంట్ రోడ్డు మధ్యలో తవ్విన కాలువ



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం కడప పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన అమీన్‌పీర్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. - **సత్తెనపల్లి**

ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందజేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దాచేపల్లి నగర పంచాయతీలోని ముదిరాజ్‌ల కల్యాణ మండపం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం దాచేపల్లిలోని బ్రాహ్మణగడ్డలోని మదర్స్ ఇస్లాహుల్ బాణాత్ అరబిక్ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై ఐదేళ్ల ఆలిమ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలను పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి కట్టుబడి వున్నామన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు అందేస్తుందన్నారు. అలాగే తానూ 20 సంవత్సరాలుగా లక్ష రూపాయలను హజ్‌యాత్రికులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో యల్లబోయిన రామకోటయ్య, గుర్రం శ్రీనివాసరావు, బొడ్డు పెద నరసయ్య, నరసింహారావు, జువ్వల నాగరాజు, యూసఫ్ మౌలానా, ఫరూక్ మౌలానా, కౌన్సిలర్ షేక్‌షరీఫ్, దాచేపల్లి మాజీ సర్పంచ్‌లు తంగెళ్ల శ్రీనివాసరావు, వలి, విద్యాకమిటీ చైర్మన్ పూసల హఫీజ్ పాల్గొన్నారు.



గంగాధర్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడి
- నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు గంగాధర్‌ను సత్కరించిన మంత్రి


పెదకూరపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్న సత్యానికి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన మద్దిరాల గంగాధర్ ఒక నిదర్శనని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఆదివారం గంగాధర్ మంత్రి సవితను విజయవాడలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె గంగాధర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బీసీల సామాజిక రాజకీయ ఆర్థికాభివృద్ధికి కృషి చేసేది టీడీపీయేనని అన్నారు. కార్యక్రమంలో కూరపాటి రఘు రామయ్య, అమరేశ్వరపు నరసింహారావు, వెంకాయమ్మ, హరీష్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి

బాపట్లరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పల్నాడుజిల్లా పెదకూరపాడు మండలం గారపాడు గ్రామానికి చెందిన జీ.అప్పారావు (55) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో సూర్యలంక తీరానికి సముద్ర స్నానానికి వస్తుండగా సూర్యలంక సమీపంలోని చప్టా వద్ద ఆటో ఆపి బయటకు దిగి రోడ్డు దాటుతుండగా బాపట్ల నుంచి సూర్యలంకకు వెళుతున్న ద్విచక్రవాహనం వేగంగా అప్పారావును ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన అప్పారావుని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్లరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ రాజీనామా చేయాలి

సత్తెనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 2021 -22 సంవత్సరాల్లో సోలార్ విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రస్తుత ఆయన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని టీడీపీ పల్నాడుజిల్లా అధికార ప్రతినిధులు పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావులు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.






క్యూలో బారులు తీరిన భక్తులు, జమ్మిచెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అమరావతిలో కార్తీక సందడి

అమరావతి, నవంబరు 24: కార్తీకమాసం నాల్గవ ఆదివారం పురస్కరించుకుని ఉమ్మడి గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం 5గంటలకు పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరము స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు బస్సులలో విచ్చేసి అమరావతిని సందర్శించారు. వీరిరాకతో ధ్యానబుద్ధ ప్రాంగణం, అమరేశ్వర ఆలయ ప్రాంగణం కళకళలాడాయి.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన బెల్లంకొండ శివారున వేంచేసిన లక్ష్మీ తిరుపతమ్మ, గంగమ్మ, అంకమ్మ, పోలేరమ్మ దేవాలయాల వద్ద ఆదివారం లక్ష ఒత్తుల దీపోత్సవ కార్యక్రమం నిర్వహించినట్టు పులుపుల వెంకట ఫణి కుమార్ శర్మ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల వద్ద ఒత్తుల కార్యక్రమం నిర్వహిస్తే ప్రజలకు, గ్రామానికి మంచి జరుగుతుందనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. మహిళలు భారీగా తరలి వచ్చి దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాల వద్ద అదనంగా మరో 50వేల దీపోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆగమ పండితులు పులుపుల వెంకట ఫణి కుమార్‌శర్మ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు, గోపయ్య స్వామి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కార్తీక వన సమారాధనలు



ఎమ్మెల్యే యరపతినేనిని సన్మానిస్తున్న కమ్మ సేవాసమితి సభ్యులు

పిడుగురాళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కార్తీకవన సమారాధన కార్యక్రమాలను ఆదివారం ఎంతోవైభవంగా నిర్వహించారు. పిడుగురాళ్ల సమీపంలోని జానపాడు, కొండమోడు, దేవరంపాడులోని నేతివెంకన్నస్వామి దేవాలయాల్లో కమ్మ, గౌడ, యాదవ, కాపు, మేర సామాజిక వర్గాల కార్తీక వనసమారాధన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ఆయా సామాజికవర్గాల అభ్యున్నతికి గతంలో టీడీపీ ప్రభుత్వం చేసినకృషిని వివరించారు.

బాలికా విద్యకు ప్రోత్సాహమిద్దాం
- కమ్మ సంఘం సభ్యుడు పెద్ది సాంబశివరావు

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): బాలికా విద్యకు ప్రోత్సాహమిద్దామని గుంటూరు కమ్మ సంఘ పాలక మండలి సభ్యుడు పెద్ది సాంబశివరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో మాచర్ల నియోజకవర్గ కాకతీయ కమ్మజన సేవా సమితి ఆధ్వర్యాన కార్తీక వన సమారాధన నిర్వహించారు. మాచర్లలో కమ్మజన సేవా సమితికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సాంబశివరావు తెలిపారు. ముత్తవరపు సురేష్‌బాబు, సీతారామయ్య, దండా గోపి, యాగంటి మల్లికార్జునరావు, మండవరవి, యనమదల వెంకట్రామయ్య, ముప్పాళ్ల శివకృష్ణలు ప్రసంగించారు. 40 మంది విద్యార్థులకు రూ. 5 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించారు. మహిళలకు చీరలు బహుకరించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నేతలు పలువురు పాల్గొన్నారు. అలాగే వీపీఎస్ గార్డెన్స్‌లో పద్మశాలీ, నగరేశ్వర ఆలయంలో ఆర్యవైశ్య సంఘ కార్తీక వన సమారాధనలు జరిగాయి.

యాదవులు రాజకీయంగా రాణించాలి
- విశాఖపట్నం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్

యాదవులు రాజకీయంగా రాణించాలని విశాఖపట్నం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో గల ఎల్‌సీకే ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘ కార్తీక వనసమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నెహ్రూనగర్ నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భరత్, తాళ్ల వెంకటేష్ యాదవ్, అంబటి రామకృష్ణ, యర్రగడ్డ నాగరాజు, ఏజీపీ జీవీ యాదవ్, గాదె రామకృష్ణ, బట్టు మధుయాదవ్ పాల్గొన్నారు.



వనసమారాధనలో ఐక్యత చాటుతున్న యాదవ సంఘీయులు

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ విద్యుత్ కేంద్రం ఉద్యోగులు ఆదివారం మండలంలోని అనుపులో కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుడి జలవిద్యుత్ కేంద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ అప్పాజి, డీఈలు, ఏఈలు ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి ఆధ్వర్యంలో మండలంలోని భీమవరం గ్రామంలో గల కాటి అంకమ్మ తల్లి దేవస్థాన కళ్యాణ మండపంల నియోజక వర్గ వడియ రాజుల కార్తీకవన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆయా సామాజికవర్గ నేతలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నాన్ క్యాడర్ ఎస్పీగా నరసరావుపేట అడ్మిన్ ఏఎస్ సంతోష్

నరసరావుపేట లీగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నరసారావుపేట అడ్మిన్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సంతోష్ ఎస్పీగా పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 22 మంది ఏఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. వీరికి త్వరలో ఉద్యోగోన్నతి ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు సమాచారం. వీరిలో పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీగా ఉన్న జె.వి.సంతోష్ కూడా ఉన్నారు.



రిషివర్ధన్, శ్రీదేవి

జాతీయ స్థాయి పోటీలకు రొంపిచర్ల విద్యార్థుల ఎంపిక

రొంపిచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల జడ్పీ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో అండర్ - 14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సుభానీ ఆదివారం తెలిపారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో చిత్తూరు జిల్లాలోని అరగొండలో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. వీరు డిసెంబరు నెలలో మహారాష్ట్రలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం

నరసరావుపేట అర్బన్, నవంబరు 24: నరసరావుపేట పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఆవరణలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, కామేశ్వరస్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

దాడిలో వ్యక్తికి గాయాలు

ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని బోడెపూడివారిపాలెంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన మద్దెపూడి రమేష్ పొలం దున్నేందుకు పేరెడ్డి పాపయ్యను అడిగి గుంటక తెచ్చుకున్నాడు. అదేసమయంలో తనకు కావాలని ఓరుగంటి సురేష్ అనే వ్యక్తి రమేష్‌ను అడ్డగించాడు. ఆ సమయంలో ట్రాక్టర్ మీద ఉన్న రమేష్ కిందకు దిగి వస్తుండగా తల మీద ఇనప రాడ్డుతో సురేష్ దాడిచేయగా తలకు తీవ్ర గాయం అయింది. క్షతగాత్రుడిని వినుకొండ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. పోలీసులకు బాధితుని బంధువులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలి

● పీడీఎం నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు విద్యుత్ రంగంలో ప్రవేశపెట్టడాన్ని వెంటనే విరమించుకోవాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో పీడీఎం ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సందర్భంలో ప్రస్తుతం ఉన్న కూటమి నాయకత్వం తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఇప్పుడు గత ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయటం సరైన విధానం కాదని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్ రీచార్జ్‌లా కరెంట్ రీచార్జి చేసుకునే విధానం చాలా ప్రమాదం అన్నారు. అర్ధరాత్రి రీచార్జి అయిపోతే కరెంట్ ఆగిపోయే పరిస్థితి వస్తుందన్నారు. నిరసన కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, నల్లపాటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం ఎంపిక

యడ్లపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండల రణవీరాంజనేయ బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. మండంలోని బోయపాలెం ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా పి.హనుమాచార్యులు, అధ్యక్షుడిగా వైటీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా వి ప్రేమకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వైవీ రమేష్ బాబు, జనరల్ సెక్రటరీగా కేఎంవీ హనుమాన్, కార్యదర్శులుగా కేవీ హనుమంతరావు, వి.సాయితేజ, పి.శ్రీరామయ్య, కోశాధికారిగా పి.రంగాచార్యులు, ముఖ్య సలహాదారుగా వి.ఆనందకుమార్‌లను సమాఖ్య సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులను బ్రాహ్మణ సమాఖ్య పెద్దలు అబినందించారు.

ఆవు కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు

రొంపిచర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లకుంటలో ఒక రైతుకు చెందిన ఆవు కడుపులో నుంచి ఆరు కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను పశు వైద్యులు తొలగించారు. శనివారం సాయంత్రం ఈ చికిత్సను వైద్యులు శ్రీధర్‌రెడ్డి, సాయి మహేష్‌రెడ్డిలు చేశారు. ఆవు ప్లాస్టిక్ వ్యర్థాలను తినటం వల్ల జీర్ణకోశ సంబంధ వ్యాధులు వస్తాయని వైద్యులు తెలిపారు. ఆహారం తీసుకోకపోవటం, పాలు ఇవ్వక పోవటం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్లాస్టిక్ కవర్లను ఎక్కడి పడితే అక్కడ వేయటం వల్ల పశువులు తింటున్నాయని తెలిపారు.

మార్కెట్ యార్డు షాపులు కబ్జా

నరసరావుపేటలో అధికారం అండతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మార్కెట్ యార్డు కాంప్లెక్స్‌లోని షాపులను అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కబ్జా చేశారు. మార్కెటింగ్ శాఖ షాపులకు వేసిన తాళాలను పగలగొట్టారు. అధికారం మాదే మమల్ని అడిగేదేవరు అన్న రీతిలో వారు బరితెగిస్తున్నారు. నిబంధనలు పాటించే పరిస్థితులు లేవు. అక్రమించిన షాపులను లీజుకు ఇచ్చుకున్నారు. ఒక్కొక్క షాపును నెలకు రూ.30వేల వరకు అద్దెకు ఇచ్చినట్లు సమాచారం. మార్కెట్ యార్డుకు రూపాయి కూడా లీజు చెల్లించడంలేదు. షాపుల తాళాలు పగలకొట్టి వాటిని అక్రమించినా చర్యలు తీసుకోవాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వ్యక్తులు షాపులను స్వాధీనం చేసుకొని వారు లీజుకు ఇచ్చుకోవడం జరుగుతోంది. షాపుల లీజుకు పది రోజుల్లో వేలం నిర్వహించనున్నట్లు సబంధిత అధికారులు తెలిపారు. అధికార పార్టీ అండదండలు ఉండటంతో కబ్జాదారులపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సాహసం చేయడంలేదు. రాజకీయ ఒత్తిడిలకు వారు తలొగ్గుతున్నారన్న విమర్శలున్నాయి. అక్రమణదారులు షాపులపై ఎమ్మెల్యే ఫొటోతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడం గమనార్హం.

- నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



నరసరావుపేటలోని మార్కెట్ యార్డు కాంప్లెక్స్‌లో అక్రమించిన షాపులు

సాయంచేసే గుణాన్ని అలవర్చుకోవాలి

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పది మందికి సాయంచేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వి.ఆంజనేయులు అన్నారు. మార్కాపురం రోడ్డులోని కాకతీయ కమ్మ వసతి గృహంలో కమ్మవారి కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీ.వి.ఆంజనేయులు మాట్లాడుతూ ఈరోజు యువతే దేశానికి పెద్ద సంపద అని గుర్తించాలన్నారు. విద్యార్థి దశ నుంచి టీడీపీలో పనిచేశానని, కష్టపడి పనిచేసినందుకు పల్నాడు ప్రాంతానికి గౌరవంగా నారా చంద్రబాబునాయుడు చీఫ్ విప్ పదవిని అప్పగించారని, ఎన్డీఏ ప్రభుత్వ గౌరవాన్ని పెంచుతామని, ఘర్షణలకు, గొడవలకు, కార్పణ్యాలకు తావు ఇవ్వద్దన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లోని నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సాయం అందించాలని పిలుపునిచ్చారు. తాను జేకేసీలో విద్యను అభ్యసించానని, ఆ నాడు కమ్మ వసతి గృహంలో ఉండటం పెద్ద మలుపు అన్నారు. అక్కడ ఎంతోమందికి సాయం చేసిన బొల్లినేని సత్యనారాయణ దాత స్ఫూర్తితోనే తాను కూడా భవిష్యత్‌లో ఆ స్థాయిలో ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ రోజు తాను శివశక్తి ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు, లీడ్ ఇండియా కార్యక్రమాలు, కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించటం ఆనాటి దాత స్ఫూర్తితోనేనని చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా అయ్యానని, ఈ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు ఎప్పుడూ అండగా ఉంటానని, కమ్యూనిటీకి కూడా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కమ్యూనిటీకి ఉపయోగపడేలా స్థలం ఇచ్చిన గంగినేని వెంకటేశ్వరరావు, గంగినేని రామయ్యలకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. గుంటూరులోని రాయుడు మాస్టారు చేస్తున్న సేవా కార్యక్రమాలు గురించి ప్రశంసించారు. ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపులతోపాటు పోట్ల రాధాకృష్ణమూర్తి, డాక్టర్ గోగినేని సాంబశివరావు, లగడపాటి వెంకటరావు, పారా లక్ష్మయ్య, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, ప్రముఖ న్యాయవాది పోట్లూరి సైదారావులతోపాటు నియోజకవర్గంలోని పెద్దలు, యువత, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.



కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

● ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలంలోని ముప్పాళ్ళ శివాలయంలో ఆదివారం వనసమారాధన చేశారు. దంపతులు హోమాలు చేశారు. వనభోజనాలను పెట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు జీవీ ఆంజనేయులును, మక్కెన మల్లికార్జునరావును ఘనంగా సన్మానించారు.

కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధికి తోడ్పడండి

ఈపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులంతా ఐకమత్యంతో కలిసికట్టుగా ఉంటూ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అప్పుడే గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించవచ్చునని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళలో నూతనంగా నిర్మించిన భ్రమరాంబ మల్లికార్జున కల్యాణ మండపాన్ని ఆదివారం జీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు గ్రామస్థులతో కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి పాటు పడడం చాలా సంతోషించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించిన దాతలను జీవీ ఆంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మోదుగుల సత్యనారాయణ, నరసింహారావు, విడపలపాటి హనుమయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, తిరుమలశెట్టి బాలయ్య పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సినీ నటుడు నరేష్, వేదికపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, ఎన్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు

మార్షల్ ఆర్ట్స్ యూనివర్శిటీ నెలకొల్పాలని ఉంది

● సినీ నటుడు నరేష్

నరసరావుపేట కల్చరల్, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేనివిధంగా మార్షల్ ఆర్ట్స్ యూనివర్శిటీ స్థాపించాలని ఉందని సినీ నటుడు నరేష్ అన్నారు. ఆదివారం స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో దివంగత సినీనటి డాక్టర్ విజయనిర్మల మెమోరియల్ ఆధ్వర్యంలో జరిగిన 38వ సౌత్ ఇండియా ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తన తల్లిగారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం కుంగ్-ఫూ, కరాటే, కర్రసాము, యోగా, భరతనాట్యం వంటి కళలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించి, బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. యూనివర్శిటీ స్థాపనలో తనకు అందరూ సహకరించాలని కోరారు. సభలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఇటీవల అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించి, ఇప్పుడు అంతేస్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. పోటీలలో తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి సుమారు 600మంది విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు సినీ నటుడు నరేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పీ డా.రాజశిఖామణి, ఎన్ఈసీ గ్రూపు సంస్థల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ డా.ఎం.ఎస్.రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా మణికంఠ

బొల్లాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం అనంతపురం పట్టణంలో జరిగింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజ్ సెక్రటరీగా వినుకొండ పట్టణానికి చెందిన చందోలు మణికంఠ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాణిజ్య ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మణికంఠను అభినందించారు. ఈ సందర్భంగా పలు ఆర్యవైశ్య సంఘం నాయకులు మణికంఠకు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో గ్రంధిశిల యశ్వంత్, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.



చందోలు మణికంఠను అభినందిస్తున్న టీజీ భరత్

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వినుకొండ టౌన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆపదలో ఉన్న నిరుపేదల వైద్యసాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సీఎం చంద్రబాబునాయుడు సాయం అందజేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వి.ఆంజనేయులు అన్నారు. 2014 నుంచి 2019 మధ్యగాని, నేడు సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న సాయాన్ని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు జీవి చేతులమీదుగా ఆదివారం పంపిణీచేశారు. అర్హతలో ఉన్న ప్రభుత్వం నుండి అర్హత పొందలేని నిరుపేదలకు సీఎం ఆర్ఎఫ్‌లకు దరఖాస్తు చేసుకున్న 47 మంది లబ్ధిదారులకు రూ.92లక్షలు విలువచేసే చెక్కులను లబ్ధిదారులకు పంపిణీచేశారు. జగన్ ఐదేళ్ళ పాలనలో ఏళ్ళ తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో వైద్యులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వంలో సీయం చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. పేదరికంలేని సమాజం ఆర్థికంగా రాష్ట్రాన్ని తీర్చిద్దాలన్నది లక్ష్యంతో విజన్ 2047 తీసుకువచ్చారన్నారు. బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యానికి రూ.18,421 కోట్లు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటూరు సాంబశివరావు, నలబోలు రామకోటేశ్వరరావు, యరమాసు కోటేశ్వరరావు, గోరంట్ల హనుమంతరావు, పివి సురేష్, మేడం రమేష్, పువ్వాడ కృష్ణ, మద్దుకూరి రాంబ్రహ్మం, సోమేపల్లి బ్రహ్మయ్య, మాదాల చిరంజీవి, చెల్లా ప్రసాద్‌తోపాటు బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

లింగంగుంట్లలో యువకుడు ఆత్మహత్య

లింగంగుంట్ల (నరసరావుపేట రూరల్), నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): మండలంలోని లింగంగుంట్లలోని ఎస్ఎస్‌పీ కాలనీలో నివాసముండే మణిరాజు (28) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు తల్లి గోదా అన్నా మేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

ఆత్మహత్యకు కారణమైన శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలి: గోదా

లింగంగుంట్లలో ఆత్మహత్య చేసుకున్న మణిరాజు చావుకు కారకుడైన ఇల్లూరి శ్రీనివాసరెడ్డిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన ఇల్లూరి శ్రీనివాసరెడ్డి వద్ద గత ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని తన వద్ద ఉన్న ఆటోను మణిరాజ్ యాక్సిడెంట్ చేయగా దానికి సంబంధించిన డబ్బులు చెల్లించాలని శ్రీనివాసరెడ్డి ఒత్తిడి చేస్తున్నాడని అందువల్లనే మణిరాజు ఆత్మహత్య చేసుకున్నాడని ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బొల్లాపల్లిలో నేత్రపర్వంగా శ్రీవారి పుష్పయాగం

బొల్లాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బొల్లాపల్లిలో అమేయ ప్లాంటేషన్ నిర్వాహకులు రమేష్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, పుష్పయాగం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో సమీపంలో నయనతార నుంచి వచ్చిన వేద పండితులు ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత గాయకులు హైదరాబాద్ నుంచి వచ్చిన సాయి శిల్ప, చెన్నై నుంచి వచ్చిన మానసచార్య వెంకటేశ్వర స్వామి భక్తి గీతాలను ఆలపించారు. ఈ గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళ్యాణోత్సవాలను తిలకించేందుకు విజయవాడ, హైదరాబాద్, రాజమండ్రి, విశాఖపట్నం, పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



చిరుమామిళ్ళ శ్మశాన వాటిక ప్రాంగణంలో గేదెలు

వైసీపీ నేత అనుచరుడి ఆధీనంలో హిందూ శ్మశాన వాటిక

నాదెండ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళలో హిందూ శ్మశాన వాటిక గ్రామానికి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి అనుచరుడు యామర్తి పాపయ్య ఆధీనంలో ఉంది. గత ఐదు సంవత్సరాలుగా ఆయన శ్మశాన వాటికను స్వాధీనం చేసుకొని పాలన చేశాడు. తెలంగాణ నుంచి తెచ్చిన దున్నపోతు కుర్రలను శ్మశాన ప్రాంగణంలో ఉంచి గేటుకు తాళం వేస్తాడు. కొన్నాళ్ళ మేపి పెరిగి పెద్దయ్యాక వాటిని అమ్మటం పాపయ్యకు అలవాటు. ఎవరైనా చనిపోయినప్పుడు మాత్రమే తాళాన్ని తీయిస్తుంటాడు. ఈ విషయాన్ని రెండు సంవత్సరాల క్రితం గ్రామస్థులు డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన గేటు తాళాన్ని గ్రామ కార్యదర్శికి అప్పగించాడు. ఆ తరువాత మరలా కార్యదర్శి వద్ద నుంచి తాళం తీసుకొని తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. శ్మశాన వాటిక గేటు తాళాన్ని కార్యదర్శికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రక్షిత నీటి సరఫరాలో నిర్లక్ష్యం




నరసరావుపేట మునిసిపాలిటీలో రక్షిత నీటి సరఫరాలో నిర్లక్ష్యం తాండవిస్తోంది. తాగునీరు కలుషితం అవుతోంది. తాగునీరు విడుదల చేసే వాల్ పిట్‌లు మురుగుతో నిండి ఉన్నాయి.



మురుగునీటితో నిండిపోయిన వాల్వ్‌గుంత

వాల్‌ల నుంచి నీరు లీకు అవుతోంది. పల్నాడు రోడ్డులోని గ్రంథాలయం సెంటర్‌లో తాగునీటి సరఫరా వాల్వ్‌గుంతలో మురుగు నీరు నిలిచింది. ఇదే ప్రాంతంలో వ్యర్థాలు పోస్తున్నారు. వాల్ నుంచి నీరు కూడా లీక్ అవుతోంది. నీటి సరఫరా సమయంలో పైపు నుంచి వాల్వ్ ద్వారా నీరు బయటకు ప్రవహిస్తుండగా నీటి సరఫరా లేని సమయంలో పిట్‌లోని మురుగు నీరు పైపుల్లోకి వెళుతోంది. వాల్వ్‌పిట్‌లను శుభ్రంగా ఉంచడాన్ని మునిసిపల్ నీటి సరఫరా విభాగం విస్మరించింది. తాగునీరు కలుషితం అవుతున్నా అధికారులు స్పందించడంలేదు. ఇప్పటికైనా తాగునీటి పైపులైన్‌లపై ఉన్న వాల్వ్ గుంతలను శుభ్రంగా ఉంచడంతో పాటు వాల్వ్ నుంచి నీరు లీకు అవకుండా చర్యలు చేపట్టాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు వెంటనే స్పందించాలి.

- నరసరావుపేట, ఆంధ్రజ్యోతి



స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

కూటమి ప్రభుత్వం కోసం అందరికృషి ప్రశంసనీయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి చదువుకున్న ప్రతిఒకరూ ఎన్నికల కోసం పనిచేశారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం అమరావతి మండలం లింగాపురంనకు చెందిన రాయపూడి శంకరావు తనయుడు అమెరికాలో స్థిరపడి 11 మంది పేద విద్యార్థులకు రూ.1,15,000లు స్కాలర్ షిప్‌లు అంధజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మాలపాటి శ్రీధర మాట్లాడుతూ రామకృష్ణను స్ఫూర్తిగా తీసుకొని ఇతర దేశాలలో స్థిరపడిన తెలుగువారు మరింతమంది పేద విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడాలని సూచించారు. స్కాలర్ షిప్ అందుకున్న ప్రతి విద్యార్థి కూడా చదువులలో మరింత రాణించి పదిమందికి సహాయం చేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎన్‌వీఎస్ వరప్రసాద్, రాయపూడి శంకరరావు, నరసింహారావు, రవి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో వైభవంగా ఉరుసు

చిలకలూరిపేట, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పోతవరంలో మౌలానా మౌల్వీ మహమ్మద్ అబ్దుల్లా భాష బాబా 73వ ఉరుసు మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మస్తాన్ వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.



ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న ప్రత్తిపాటి

అక్రమ మద్యం వ్యాపారులపై కేసు నమోదు

బొల్లాపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బొల్లాపల్లిలో ఈపూరు ఎక్సైజ్ పోలీసులు బొల్లాపల్లికి చెందిన ఖాశిం సైదా, గోవిందు అనే వ్యక్తులు గ్రామంలో అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం అందటంతో శనివారం రాత్రి వారిని అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని రాత్రి తహసీల్దార్ ముందు హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ డీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించటం చట్ట రీత్యా నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఈనెలలో 13 అక్రమ మద్యం కేసులను నమోదు చేయటం జరిగిందని, పది మందిని బైండోవర్ చేయటం జరిగిందని, అలాగే గ్రామాల్లో నాటు సారా గురించి ఎటువంటి సమచారం ఉన్నా తమకు తెలియ జేయాలన్నారు.